క్లుప్తంగా

నేడు రంపచోడవరానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ రాక

రంపచోడవరం: మండలంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు), ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి రానున్నట్టు అడ్డతీగల పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి తోట రాజేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీలో వారు పాల్గొంటారని చెప్పారు. అనంతరం ధారగూడెం, సోకులగూడెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని వినతి

ఎటపాక: మండల కేంద్రం ఎటపాకలో నిర్మిస్తున్న కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ పృథ్వీకి వినతి పత్రం ఇచ్చారు. పెట్రోల్ బంక్ నిర్మాణం చేయవద్దని కోర్టు ఆదేశించినప్పటికీ నిర్మాణ పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. పనులు నిలుపుదల చేయకపోతే కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి ఐ.వి.ఆకిశెట్టి, రాము తదితరులున్నారు.

నెల్లిపాక చేరిన అయోధ్య అక్షింతలు


నెల్లిపాకలో అక్షింతలను ఊరేగిస్తున్న నిర్వాహకులు

ఎటపాక: అయోధ్యలోని రామమందిరం అక్షింతలు, కరపత్రాలు, శ్రీరామ స్టిక్కర్లు మంగళవారం నెల్లిపాక చేరాయి.విశ్వహిందూ పరిషత్, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీటిని ముత్యాలమ్మ గుడి నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకు వచ్చారు. జనవరి 1నుంచి 7వరకు మండలంలోని ప్రతి ఇంటికి అక్షింతలు, కరపత్రాలు, స్టిక్కర్లు అందించనున్నట్టు నిర్వాహకులు శ్రీనివాస్ తెలిపారు. జనవరి 22న రామజన్మభూమిలో జరిగే విగ్రహప్రతిష్ట మహోత్సవాలకు అందరూ రావాలని కోరారు.

గిరిజన వికాస కేంద్రంలో భగవద్గీత కంఠస్థ పోటీలు

రంపచోడవరం: స్థానిక గిరిజన వికాస కేంద్రం పాఠశాలలో శ్రీ భగవద్గీత కంఠస్థ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల కరస్పాండెంట్ ఎస్.భవన్నారాయణ, హెచ్ఎం ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు జి.ఈశ్వరరాజు, యర్రా ఆనంద రావు, అద్దంకి వెంకటేశ్వరరావు, గుడ్లఅంక శ్రీనివాసరెడ్డి నల్లమిల్లి వెంకటరామారెడ్డిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

పాస్టర్ మృతికి సంతాపం


అప్పలరాజు (ఫైల్)

రాజవొమ్మంగి: స్థానిక పోస్టాఫీస్ వీధిలో నివసిస్తున్న సీనియర్ పాస్టర్, ఆర్ఎంపీ వైద్యుడు సర్వసిద్ధి అప్పలరాజు (డాక్టర్ లూకా) మంగళవారం మృతిచెందారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అస్వస్థతకు గురైన ఆయనను 108లో నర్సీపట్నం తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు కుమారుడు నాగేంద్రకుమార్ తెలిపారు. అప్పలరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అంగన్‌వాడీల నిరసన


రాజవొమ్మంగిలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

రాజవొమ్మంగి: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మంగళవారం తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ రాజవొమ్మంగిలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ మండల యూనియన్ కార్యదర్శి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



- ఏడాదికి రూ.18,750 చొప్పున ఆర్థికసాయం
- చిరువ్యాపారాలతో మహిళలకు స్వయం ఉపాధి
- ప్రభుత్వ సాయంతో ఆర్థికాభివృద్ధి



ఈ చిత్రంలో కిరాణాషాపు నిర్వహిస్తున్న మహిళ పేరు కత్తిక లక్ష్మి. ఈమెది చింతూరు గ్రామం. ఇద్దరు మగపిల్లలు. మూడేళ్ల క్రితం భర్త అనారోగ్యంతో మృతిచెందడంతో కుటుంబపోషణ ఈమెపై పడింది. వైఎస్సార్ చేయూత ద్వారా వచ్చిన రూ.18,750కి తోడుగా వైఎస్సార్ క్రాంతి పథంలో స్త్రీనిధి కింద రూ.50 వేలు అప్పుగా తీసుకుని కిరాణాషాపు నడుపుతోంది. షాపు ద్వారా వస్తున్న ఆదాయంతో అటు అప్పు తీర్చడంతో పాటు ఇటు కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటోంది. కుటుంబపోషణ భారంగా మారిన తనకు వైఎస్సార్ చేయూతతో పాటు వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా లభించిన సొమ్ము ఎంతగానో ఉపయోగపడిందని లక్ష్మి చెబుతోంది.



ఈ ఫొటోలో కూరగాయలు, ఉప్పు చేపలు విక్రయిస్తున్న మహిళ పేరు మెల్లం సుశీల. ఈమెది చింతూరులోని శబరిఒడ్డు ప్రాంతం. ఈమెకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. ఈమె భర్త అనారోగ్యంతో పనిచేయలేని స్థితిలో ఉండడంతో కుటుంబపోషణ ఈమెపై పడింది. తనకు వైఎస్సార్ చేయూత ద్వారా వచ్చిన సొమ్ముతో చింతూరులో కూరగాయలు, ఉప్పుచేపలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఎన్నో కష్టాల్లో ఉన్న తనకు వైఎస్సార్ చేయూత నగదు ఎంతగానో ఉపయోగపడిందని సుశీల తెలిపింది.

మహిళల ఆర్థిక స్వావలంబనకు చేయూత

చింతూరు: మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున ఇప్పటికి మూడు విడతలుగా ఆర్థికసాయం అందించింది. ఈ సొమ్ముకు తోడు స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా మరికొంత సాయాన్ని అందించడం ద్వారా వారు చిరు వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది.

చేయూతకు అదనపు సాయం

ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో వ్యాపారాలు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని చాలామంది మహిళలు ఆశిస్తున్నారు. అలాంటి వారికి వైఎస్సార్ క్రాంతిపథం శాఖ స్త్రీనిధి, అంతర్గత అప్పు, రివాల్వింగ్ ఫండ్ ద్వారా రూ.50 వేల వరకు రుణంగా ఇస్తోంది. వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి ప్రభుత్వం అందిస్తున్న రూ.18,750కు తోడుగా వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా అందుతున్న రూ.50 వేల రుణంతో మహిళలు వ్యాపారాల్లో రాణిస్తున్నారు. ఈ సొమ్ముతో కిరాణా, ఫ్యాన్సీ, వస్త్ర దుకాణాలు, మేకలు, గేదెలు, ఆవుల పెంపకం, సేంద్రియ కూరగాయలు పండించడం, తినుబండారాలు తయారు చేయడం వంటి వ్యాపారాలు చేస్తున్నారు. వ్యాపారంలో వచ్చిన లాభాలతో తాము అప్పుగా తీసుకున్న రూ.50 వేలను ప్రతినెల వాయిదా పద్ధతిలో చెల్లిస్తూ బకాయిని తీర్చడంతో పాటు ఏడాదికి రూ.లక్ష వరకు ఆదాయం పొందుతున్నారు.

ఆర్థిక సాయం సద్వినియోగం ఇలా..

ఆర్థిక సాయం పొందిన మహిళల్లో 501 మంది సేంద్రియ కాయగూరల పెంపకం, 373 మంది మేకల పెంపకం, 161 మంది పాడిగేదెలు, ఆవుల పెంపకం చేపడుతున్నారు. 58 మంది కిరాణా షాపులు, 17 మంది వస్త్ర దుకాణాలు, 25 మంది తినుబండరాల తయారీ నిర్వహిస్తున్నారు.

చింతూరు మండలంలో మూడు విడతల్లో మంజూరైన ఆర్థిక సాయం

సంవత్సరం	లబ్ధిదారులు	విడుదలైన సొమ్ము
2020-21	2,072	రూ.3.88 కోట్లు
2021-22	1,663	రూ.3.12 కోట్లు,
2022-23	1,867	రూ.3.50 కోట్లు

వ్యాపారాల నిర్వహణకు ప్రోత్సాహం



మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు వైఎస్సార్ చేయూత పథకం ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆ నగదుకు తోడు అప్పుకింద వారికి మరికొంత సొమ్ము ఇచ్చి వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నాం.

– స్వామినాయుడు, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం, చింతూరు


చింతూరు మండలం నిమ్మలగూడెంలో గేదెల పెంపకం చేపడుతున్న పాడియం కాంతమ్మ

మండలం : చింతూరు

గ్రామాలు	125
పంచాయతీలు	18
స్వయం సహాయక సంఘాలు	850
గ్రామసంఘాలు	51
స్వయం సహాయక సభ్యులు	8,500

సమన్వయంతో పనిచేస్తే విజయం తథ్యం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


వైఎస్సార్‌సీపీ ఆత్మీయం సమ్మేళనంలో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: వైఎస్సార్‌సీపీ మండలనాయకులు సమన్వయంతో ముందుకు సాగితే విజయం తథ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కాశీపట్నం సీతంపేట గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రేగబోయిన స్వామి అధ్యర్యంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఆత్మీయం సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పార్టీ గెలుపునకు కృషి చేయాలని చెప్పారు. పార్టీ నిర్ణయాలకు అందరూ కట్టుబడి పనిచేయాలని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. 2024లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర స్వామి, ఎంపీటీసీలు మితుల, అశోక్, సర్పంచ్‌లు సన్యాసిరావు, మజ్జి అప్పారావు, సెంబి సన్యాసిరావు, సింహాద్రి, పెంటమ్మ, రాములమ్మ, మార్కెట్ యార్డు డైరెక్టర్ సూర్యానారయణ, నగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు శెట్టి లక్ష్మణ్‌రావు, వంతాల లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి


చిన్నగడ్డలో గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మత్స్యరాస వెంకటలక్ష్మి


అంతర్లలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు

చింతపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 21 న చింతపల్లి పర్యటించనున్నారని, కార్యకర్తలు, పార్టీ నాయకులు, గిరిజన ప్రజలు ఆ పర్యటనను విజయవంతం చేయాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి కోరారు. వారు మంగళవారం అంతర్ల, చిన్నగడ్డ గ్రామాల్లో వేర్వేరుగా పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి పలు పథకాలు అమలుచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. పెద్ద సంఖ్యలో అన్ని వర్గాల ప్రజలు హాజరై సీఎం పర్యటనను విజయవంతం చేయాలని వారు కోరారు.

సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్


కొర్రాలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ

డుంబ్రిగుడ: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ తెలిపారు. కొర్రా గ్రామ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా, సంక్షేమ డిస్ ప్లే బోర్డును వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరారావు, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు, లలిత, సర్పంచ్‌లు అర్జున్, ఎంపీటీసీ విజయ, ఉపాధ్యక్షులు జగ్గు నాయుడు, గణపతి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు శాంతి, లీలారాణి, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, సీనియర్ నాయకులు బాక సింహాచలం, కృష్ణారావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు


వీధి దీపాలు,డస్ట్ బిన్లు పంపిణీ చేస్తున్న అనూషదేవి, పోతురాజు బాలయ్య, గొడ్డేటి మహేష్

చింతపల్లిరూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్ ఆధ్వర్యంలో మండలంలో 17 పంచాయతీలకు ఎంపీ నిధులతో వీధి దీపాలు, డస్ట్ బిన్లు, మంటలు ఆర్పే పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఎంపీ గొడ్డేటి మాధవి చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆశాజ్యోతి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, ఏపీ ట్రైకార్ డైరెక్టర్లు సుర్ల లోవరాజు, సుమర్ల సరస్వతి, సర్పంచ్ దురియా పుష్పలత, వైస్ ఎంపీపీ వెంగళరావు, మండల అధ్యక్షుడు మోరి రవి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి గణబాబు,స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్‌మీరా, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు తిరుపతి, పార్టీ నాయకుడు జల్లి సుధాకర్ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

చోడవరం : చోడవరం స్వయంభూ వినాయక నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పడింది. నూతన అధ్యక్షుడిగా రాయవరపు నానాజీ, ప్రధాన కార్యదర్శిగా గోల్కొండ కాశీ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కాపార్తు నానాజీ, సంయుక్త కార్యదర్శిగా సుందరపల్లి వినోద్, కోశాధికారిగా కనితి దుర్గారావు, సభ్యులుగా ఉప్పాల శ్రీను, మంచుపల్లి శ్రీనివాసరావు, బయ్యవరపు శ్రీను ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

ఏకలవ్యలో అమలు కాని మెనూ


చికెన్, సాంబార్ అందని విద్యార్థులు

ముంచంగిపుట్టు: పెదబయలు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ముంచంగిపుట్టు ఏకలవ్య ఇంగ్లిషు మీడియం పాఠశాల, కళాశాలలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదని విద్యార్థులు తెలిపారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం ఆ పాఠశాలను విలేకరులు సందర్శించారు. అరకొరగా భోజనం పెడుతున్నారని, కొంతమందికి చికెన్, సాంబార్ వడ్డించలేదని విద్యార్థులు విలేకరులకు చెప్పారు. మెనూ విషయం ఉన్నతాధికారులకు చెప్పవద్దని ఉపాధ్యాయులు చెబుతున్నారని తెలిపారు. విద్యార్థులు విలేకరులతో మాట్లాడుతుండగా వారిని ఉపాధ్యాయులు లోపలికి పంపించి వేశారు. మెనూ సక్రమంగా అమలుకాని విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ శివశంకర్‌కు వివరణ కోరగా ఆయన సరిగా స్పందించలేదు.

దివ్యాంగ బాలలపై ప్రత్యేక దృష్టి


దివ్యాంగ బాలలకు దుస్తులు, సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు

నాతవరం: దివ్యాంగ బాలలను ప్రతి ఒక్కరు గౌరవించాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. మండల కేంద్రం యూపీ స్కూల్లో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఎంఈవో తాడి అమృత్ కుమార్ సొంత నిధులతో దివ్యాంగ బాలలకు సమకూర్చిన దుస్తులు, ఇతర సామగ్రిని ఎంపీడీవో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో అమృత్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగ బాలలకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. మండలంలో సహిత విద్యా కేంద్రాల ద్వారా 103 మంది చదువుతున్నారన్నారు. అయా కేంద్రాల దివ్యాంగ బాలలకు ప్రభుత్వం అలవెన్సుతో పాటు సకాలంలో ఇతర సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు, ఈఆర్టీ వడ్రే స్వామి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు


వరి పంట కోస్తున్న కూలీలు

గొలుగొండ : మండలంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది రావణాపల్లి, విప్పలపాలెం, దారగెడ్డ ప్రాంతాల్లో సుమారు 5వేల ఎకరాల్లో నాట్లు జరిగాయి. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో ఒకేసారి కోతలు ప్రారంభం కావడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. అయినా సరే కూలీలకు ఎక్కువ డబ్బులు ఇచ్చి కోతలు నిర్వహిస్తున్నారు. తుపాను ప్రభావంతో ఈ సమస్య వచ్చిందని రైతులంటున్నారు.

కూలీలకు డిమాండ్.

చీడికాడ : మండలంలోని పలు గ్రామాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. కూలీలకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో పక్క గ్రామాలకు వెళ్లి రైతులు ముందుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో మహిళా కూలీలకు రోజుకు రూ. 250 కూలి కాగా ప్రస్తుతం రూ. 400 వరకు చెల్లిస్తున్నారు. మోపులు మోసే మగవారికి సాధారణ రోజుల్లో రోజుకు రూ. 400 కూలి కాగా ప్రస్తుతం రూ. 600 నుంచి 800 వరకు చెల్లిస్తున్నారు.

పీఏసీఎస్ నూతన భవనం ప్రారంభం


పీఏసీఎస్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంత బాబు

అడ్డతీగల: మండల కేంద్రం అడ్డతీగలలో ఇటీవల రూ.45.25 లక్షల వ్యయంతో నిర్మించిన పీఏసీఎస్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ మేరకు శిలాఫలకాన్ని ఆవిష్కరించడంతో పాటు రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించి సొసైటీ భవనాన్ని నిర్మించినట్టు వారు చెప్పారు. ఇతరత్రా అవసరాలకు అనుగుణంగా గొడౌన్ నిర్మాణాన్ని కూడా దీనిలోనే చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పర్సన్‌ఇన్‌చార్జ్ తోట రాజేశ్వరరావు, ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసీ సభ్యుడు మద్దాల వీర్రాజు, వైఎస్ఎంపీపీ కరణం వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘తహసీల్దార్‌పై దాడికి యత్నం అవాస్తవం’


మాట్లాడుతున్న సర్పంచ్ బేసు, ఎంపీటీసీ కొర్ర నాగరాజు

హుకుంపేట: ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వలేదన్న కారణంతో తహసీల్దార్‌పై దాడికి యత్నించారని కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని తీగలవలస సర్పంచ్ పాంగి బేసు, ఎంపీటీసీ కొర్ర నాగరాజు తెలిపారు. మంగళవారం వారు ‘సాక్షి’తో మాట్లాడారు. తమ పంచాయతీ పరిధి కామయ్యపేటలో గతంలో ఇసుక రవాణా జరిగిన విషయం వాస్తమేనని, ఇటీవల పాలక వర్గం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి, ఇసుక తరలిస్తున్న వాహనాలను ఆపివేశామన్నారు. అయితే తమపంచాయతీలో ఏ ఉపాధిలేక ఇసుక ర్యాంప్‌పైనే ఆధారపడి జీవిస్తున్న గిరిజన కూలీల పరిస్థితినిదృష్టిలో పెట్టుకుని కొన్ని వాహనాలకు అనుమతిఇవ్వాలని తహసీల్దార్‌ను చాలా సార్లు కోరామని,దీనిపై ప్రశ్నించామే తప్ప దాడికి యత్నించలేదని వారు చెప్పారు. తమ పంచాయతీలో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోందని వార్తలు ప్రచురించడం బాధాకరమని తెలిపారు.

గిరిజన రైతుల అభివృద్ధికి కృషి

మన్యం బ్యాంకు కోఆర్డినేటర్ ఉదయశ్రీనివాస్


రైతులకు చెక్కును అందజేస్తున్న ఉదయశ్రీనివాస్

రంపచోడవరం: ఏజెన్సీలో రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, వ్యవసాయ పెట్టుబడులకు తమ బ్యాంకు ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నట్టు మన్యం కోఆపరేటివ్ బ్యాంకు సొసైటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయశ్రీనివాస్ తెలిపారు. రంపచోడవరం మండలం వెలమలకోట గ్రామంలో గిరిజన సమిత్ర ఫౌండేషన్ ఏర్పాటు చేసిన సకలజన రైతు ఉత్పత్తిదారుల సంఘానికి మన్యం కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా రూ.5 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంఘాల ద్వారా గిరిజన రైతులకు అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ఏజెన్సీలో ఇప్పటికే పలు రైతు సంఘాలకు రుణాలిచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంతల అచ్చియమ్మ, గిరిజన సంఘం నాయకులు సిరిమల్లెరెడ్డి ,సంస్థ సభ్యులు నాగేశ్వరరావు బుల్లిదొర, గ్రామ పెద్దలు శారపు నరసింహమూర్తి, రాజన్న దొర, పాడియం బుల్లిదొర యువ రైతులు పాల్గొన్నారు.

బంక్ ఏర్పాటు పనుల పరిశీలన

కె.కోటపాడు : పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఎ.కోడూరులో హెచ్‌పీ బంక్ ఏర్పాటుకు అనుమతులు మంజూరైనట్లు డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ నెల 21న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా బంక్ నిర్మాణానికి సంబంధించి భూమి పూజ, శిలాఫలకం ఆవిష్కరణ జరపనున్నట్లు ఆయన తెలిపారు. భూమి పూజలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడితో పాటు డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, సీఈవో వర్మ, డీసీవో పీఎస్ కిరణ్‌కుమారి, ఆప్కాబ్ ఏజీఎం రాజు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ పాల్గొంటారని తెలిపారు.